# కారెక్కిన బీజేపీ నాయకులు



భీంపూర్: జాదవ్ అనిల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గుంజాల బీజేపీ ఆదివాసీ నాయకులు

భీంపూర్, నవంబర్ 3 : భీంపూర్ మండలం గుంజాల గ్రామ సర్పంచ్ ఆత్రం లక్ష్మీపైకు ఆధ్వర్యంలో 120 మంది బీజేపీ ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నేరడిగొండలో బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు కప్పి జాదవ్ అనిల్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, నాయకులు సంజీవ్ రెడ్డి, శంకర్‌యాదవ్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

**మీ వెంటే మేము ఉంటాం**

సొనాల,నవంబర్ 3 : అన్ని వర్గాల ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ నిలుస్తున్నదని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ అన్నారు. సొనాల మండలానికి చెందిన యువకులు గురువారం సాయంత్రం నేరడిగొండలో జాదవ్ అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన సంఘాల నాయకులు మీ వెంటే మేముంటామని, గెలుపే లక్ష్యంగా కష్టపడి పని చేసి భారీ మెజార్టీ సాధించే దిశగా తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇర్ల అభిలాష్, తుల హరీశ్, సుగుణాకర్, శ్రీనివాస్, సుధీర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, షాదుల్లా, రాజు, రంజిత్, మహేందర్, ఉదయ్, శ్రీఖర్, సంతోష్, మహేశ్, ప్రశాంత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- **పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు**
- **నిర్మల్ కలెక్టర్ అశిష్ సంగ్వాన్**



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్, ఎస్పీ

నిర్మల్ టౌన్, నవంబర్ 3 : ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అశిష్ సంగ్వాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. నవంబర్ 3 నుంచి డిసెంబర్ 3 వరకు ఎన్నికల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. 3 నుంచి 10 వరకు నామినేషన్లు, 13న పరిశీలన, 15న ఉప సంహరణ, 30న పోలింగ్, 3న కౌంటింగ్‌తో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్‌లో 244, నిర్మల్‌లో 316, ముథోల్‌లో 311 మొత్తం 922 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పరిధిలో నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్‌లోని కొన్ని మండలాలను ఓటింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు పెద్దఎత్తున స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలపై అభ్యర్థులు, ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం ఓటర్ కార్డు, ఓటరు స్లిప్‌లను నాలుగు రోజుల ముందుగానే పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఓటు వేసుకోవడానికి ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డుకు అనుమతి ఉంటుందన్నారు. ఎన్నికల ఖర్చును ప్రతి మూడు రోజులకొకసారి సంబంధిత అధికారులకు తెలపాలని సూచించారు. జిల్లాలో పార్టీల ప్రచారం, సభలు, ఇతర అంశాలపై ప్రత్యేక బృందాల నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల అక్రమాలపై సీవిజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సువిధ యాప్ ద్వారా నామినేషన్లు పోటీచేసే అభ్యర్థుల ర్యాలీలు, మీటింగ్‌ల కోసం ఆన్‌లైన్ ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే 8 ప్రత్యేక పోలీస్ బృందాలు చేరుకున్నాయన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల నియామవళి పాటించాలని కోరారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారి తిరుమల, అధికారులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు

- **37 కేజీల గంజాయి, ఒక కారు, మూడు ఫోన్లు స్వాధీనం**
- **నలుగురు నిందితులు అరెస్టు**
- **ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి**



వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



అరెస్టు అయిన నిందితులు వీరే

ఎదులాపురం, నవంబర్ 3 : అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం నుంచి నరేంద్రమగర్, రాజారన్బీడేలు గంజాయి కొనుగోలు చేసి రైలులో ఆదిలాబాద్‌కు వచ్చారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో గంజాయి కొనుగోలు చేయడానికి మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ జావిద్, షేక్ రుక్సానా, షేక్ కుర్బాన్ సిద్ధంగా ఉన్నారు. వీరు అనుమానాస్పదంగా తిరుగుతుండగా టూటౌన్ పోలీసులు, సీసీఎస్ సీఐ తనిఖీలు చేశారు. వీరి వద్ద నుంచి 21 ప్యాకెట్ల ఉన్న 37 కేజీల గంజాయి విలువ దాదాపు రూ.9.25లక్షలు, కారు, మూడు సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేయగా కుర్బాన్ పరారీలో ఉన్నాడు. నిందితులను అరెస్టు చేసిన సీసీఎస్ సీఐ డీ సాయినాథ్, టూటౌన్ సీఐ ఎ అశోక్, ఎస్ఐ ప్రదీప్ కుమార్, సీసీఎస్ సిబ్బందికి నగదు రివార్డు అందజేసి అభినందించారు. సమావేశంలో డీఎస్పీ వీ ఉమేందర్, సీసీఎస్ సీఐ డీ సాయినాథ్, ఏఎస్ఐ సిరాజ్, హెడ్‌కానిస్టేబుళ్లు గంగారెడ్డి, జాకీర్‌అలీ, రుక్మారెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రహత్, నరేశ్, జోగేందర్ సింగ్, టూటౌన్ రైటర్ ప్రవీణ్‌కుమార్, హోంగార్డు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీని నమ్మితే అన్యాయం చేశారు



పెంబి జడ్పీటీసీ జానుబాయిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్

ఖానాపూర్, నవంబర్ 3: బీజేపీ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని, పార్టీని నమ్మి పని చేసిన వారిని గుర్తించకుండా ఇతరులకు పదవులను కట్టబెట్టిందని పెంబి జడ్పీటీసీ భూక్యా జానుబాయి మండిపడ్డారు. ఇటీవల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఆమె ఖానాపూర్‌కు మొదటిసారి రావడంతో మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తీసుకెళ్లి మూడో సారి కేసీఆర్ సీఎంగా కేసీఆర్ విజయం సాధించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ గెలుపులే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, పట్టణ, మండలాధ్యక్షుడు సురేశ్, రాజగంగన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి కాలేరి దివాకర్, నాయకులు వీరేశ్, ప్రదీప్, శ్రీనివాస్, మహేందర్, ప్రణీత్, మెహ్రాజ్, సోయాబ్ తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ప్రత్యేక నిఘా



ఖర్చు వివరాలు లెక్కిస్తున్న అధికారి సాయినాథ్

నిర్మల్ టౌన్, నవంబర్ 3: నిర్మల్ జిల్లాలో నామినేషన్ల పక్రియ ప్రారంభం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర్య అభ్యర్థుల ఖర్చుపై ప్రత్యేక సర్వే బృందాలు నిఘా పెడుతున్నాయి. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల ఖర్చుపై జిల్లాకు చెందిన వీఎస్‌టీ టీంతో పాటు వీసీడీ టీంను లెక్కలు వేసి ఎన్నికల అధికారులకు రోజువారీగా వివరాలు అందిస్తున్నారు. రోజువారీగా ప్రచారం, కూర్చీలు, టేబుళ్లు, ఇతర ప్రచార పోస్టర్ల ఖర్చుల వివరాలు వీడియో సర్వేటీం బృందం రికార్డు చేసి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమర్పించడంతో ఆ రోజు ఖర్చు వివరాలను లెక్కలు వేస్తున్నారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను ప్రతి మూడు రోజులకొకసారి ఎన్నికల అధికారులకు సమర్పించనున్న నేపథ్యంలో వీరు సేకరించిన ఖర్చు వారు చేసిన ఖర్చుతో సరిపోతుందా లేదా తేల్చి వివరాలను రికార్డు చేస్తున్నారు.

## నిర్మల్‌కు చేరుకున్న పోలింగ్ కిట్లు

నిర్మల్ టౌన్, నవంబర్ 3 : ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని పోలింగ్ రోజు అవసరమయ్యే కిట్లను శుక్రవారం నిర్మల్‌కు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయానికి ఈ కిట్లు రావడంతో వాటిని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలకు పంపనున్నారు. ఎన్నికల పోలింగ్, దరఖాస్తు, నామినేషన్ పత్రాలు, ఇతర సామగ్రి ఈ కిట్లలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన ఎన్నికల సామగ్రి

## ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా ప్రద్న్యశీల్ రాంవావ్ జుంలే



వ్యయ పరిశీలకుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం,నవంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ 2009 గోవా బ్యాచ్‌కు చెందిన ప్రద్న్యశీల్ రాంరావ్ జుంలేను నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలికుడిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తాతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ ) సెంటర్‌ను సాయంత్రం ఎన్నికల వ్యయ పరిశీలకుడు ప్రద్న్యశీల్ రాంరావ్ జుంలే పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న విధుల గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంట్రోల్ రూంను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణపై ఎవరికైన సందేహాలుంటే తన ఫోన్ నంబర్ 8143876383ను సంప్రదించాలన్నారు.